క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన డీఈఓ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక నెహ్రూ రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.అనురాధ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు డీఈఓ పుష్ప గుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. కడప ఉపవిద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి, ఎంఈఓ సావిత్రమ్మ ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బద్వేలు అర్బన్ : బద్వేలు సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా బద్వేలు మున్సిపాలిటీ పరిధిలో శనివారం ఉదయం 8–00 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఎస్‌పీడీసీఎల్ డీఈఈ కులాయప్ప శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి అంతరాయానికి సహకరించాలని కోరారు.

ప్రొద్దుటూరు : పట్టణంలో శనివారం ఉదయం 6.30 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏపీఎస్‌పీడీసీఎల్ నార్త్ సెక్షన్ ఏఈఈ వి.ప్రియదర్శన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మార్కెట్ యార్డులోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, వైఎంఆర్ కాలనీ, బొల్లవరం తదితర ఫీడర్లలో మెయింటెనెన్స్ పనుల కారణంగా విద్యుత్‌ను నిలిపివేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

గోపవరం : మండలంలోని చెన్నవరం సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఎస్‌పీడీసీఎల్ ఏఈ చిన్నయ్య తెలిపారు. 33 కె.వి. పాయలకుంట్ల ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, కావున వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



నిత్యావసర సరుకులు అందిస్తున్న శూలం లక్ష్మీదేవి, సూర్యనారాయణరెడ్డి

ప్రొద్దుటూరు : పట్టణంలోని నిరుపేద కుటుంబాలకు శుక్రవారం అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్ కువైట్ ఫౌండేషన్ ఇన్‌చార్జి మర్రిపాటి అమరనాథ్‌రెడ్డి, పూర్ణిమ రెడ్డిల కుమారుడు లోహిత్ కుమార్‌రెడ్డి 9వ పుట్టిన రోజు సందర్భంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి, కార్యదర్శి శూలం శివప్రసాద్ యాదవ్, మల్లికార్జున, ఎం.సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

వీధులు జలమయం



రాజుపాళెం ఎస్సీ కాలనీలో నిలిచిన వర్షం నీరు

రాజుపాళెం : ఉన్నట్టుండి ఒక్క సారిగా కురిసిన వర్షంతో వీధులన్నీ జలమయం అయ్యాయి. రాజుపాళెంలో శుక్రవారం మధ్యాహ్నం ఆకాశం నల్లగా మేఘావృతమై ఒక్క సారిగా పెద్ద వర్షం పడింది. దీంతో వీధుల్లో నీళ్లు నిలవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సీసీ రోడ్లు నిర్మించేటప్పుడు రోడ్డుకు ఇరువైపులా కాలువలు ఏర్పాటు చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని ఎస్సీ కాలనీ ప్రజలు అంటున్నారు.

ఘన సన్మానం

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని కల్లూరు పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తూ పదోన్నతిపై కడప రిమ్స్‌కు బదిలీ అయిన శరత్‌బాబును అధికారులు, సిబ్బంది సన్మానించారు. కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు శివప్రసాద్‌రెడ్డి, మహాలక్ష్మి, మునిరాంప్రసాద్, ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు కేజే రఘురామిరెడ్డి, సెక్రటరి రామసుబ్బయ్య, మైదుకూరు తాలుకా అధ్యక్షుడు చంద్రమౌళి, అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ శివరామానుజ, జాయింట్ సెక్రటరి రాజశేఖర్, పాపిరెడ్డి, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ ప్రశాంత్ వర్ధన్ సూచించారు. శుక్రవారం 'ఫ్రైడే డ్రై–డే' కార్యక్రమంలో భాగంగా కడప నగరం నాగరాజుపేట అర్బన్ ట్రెయినింగ్ హెల్త్ సెంటర్ పరిధిలోని సీయోన్ పురం ప్రాంతంలో హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్న లత ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది పర్యటించారు. తొలుత అక్కడ జరుగుతున్న డ్రై–డే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. డ్రైనేజీ కాలువలో పూడిక తీయించి లార్వా నాశక ద్రావణాన్ని పిచికారి చేయించారు. స్థానికులకు గ్రూప్ మీటింగ్ నిర్వహించి సీజనల్ వ్యాధులు, దోమల ద్వారా వ్యాప్తి జరిగే వ్యాధుల గురించి వివరించారు. ట్రైనీ డాక్టర్స్ కౌశిక్, శివ, నితీశ్, శశి , వార్డు హెల్త్, శానిటరీ సెక్రెటరీలు, ఆశా వర్కర్లు , పాల్గొన్నారు.

కనుల పండువగా ఆలయ వార్షికోత్సవం

ఖాజీపేట : తవ్వారిపల్లె గ్రామంలో వెలసిన వీరాంజనేయ స్వామి ఆలయ 7వ వార్షికోత్సవ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం స్థానికులు పెద్ద ఎత్తున వచ్చి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం సేద్యపు ఎద్దులతో బండ లాగుడు పోటీలను ఆయల కమిటీ సభ్యులు నిర్వహించారు. గెలిచిన వారికి కమిటీ సభ్యులు బహుమతి ప్రదానం చేశారు. ఉత్సవాల కోసం వచ్చిన భక్తులకు కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామి వారిని గ్రామంలో ఊరేగించారు. దీంతో ఉత్సవాలు అత్యంత వైభవంగా పూర్తయ్యాయి.



ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయుడు



బండలాగుడు పోటీలు జరుగుతున్న దృశ్యం

ఘనంగా వార్షికోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని లింగాపురం గ్రామంలో వెలసిన శ్రీ షిర్డీసాయిబాబ ఆలయంలో శుక్రవారం ఆలయ దశమ వార్షికోత్సవ వేడుకలను శ్రీ షిర్డీ సాయిబాబా సేవాశ్రమం కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో మొదలుకుని విశేష అభిషేకాలు, అర్చనలతో పాటు ప్రత్యేక అలంకరణ, సాయిసత్య వ్రతం, చందనోత్సవం, మధ్యాహ్నం హారతి తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం 1000 మందికిపైగా భక్తులకు అన్న ప్రసాద వినియోగం జరిగింది. అనంతరం బాబా ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా వాహనంలో ఏర్పాటు చేసి సాయి బాబా నామస్మరణల మధ్య వైభవంగా ఊరేగించారు. వార్షికోత్సవ వేడుకల్లో శ్రీ షిర్డీసాయి సేవాశ్రమప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని కొండా వధూత ఆశ్రమం, గోవిందయ్య మఠం ఆవరణలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చతుస్థానార్చన మూలమూర్తి హోమం, ఉత్సవబలి నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన గరుడ వాహనసేవలో శ్రీనివాసుడు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం వెంట ఏర్పాటు చేసిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాదిరెడ్డివెంకటరామిరెడ్డి, దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి సి.శివయ్య, ఆలయ ప్రధాన అర్చకులు రమేష్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడ వాహనంపై ఊరేగుతున్న శ్రీనివాసుడు



కోలాటం ఆడుతున్న యువతులు



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా మూలవిరాట్

ట్యాలీలో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ట్యాలీ కోర్సులో ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఫౌండేషన్ అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ పాస్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా పాస్‌లేదా ఫెయిల్ అయి 18 నుంచి 26 సంవత్సరాల మధ్య వయస్సుగల వారు ఇందుకు అర్హులన్నారు. 35 రోజుల శిక్షణా కాలంలో కంప్యూటర్ స్కిల్, స్పోకెన్ ఇంగ్లీషు, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్ ప్లేస్ ఎథిక్స్‌లో అత్యుత్తమ శిక్షణ ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 90004 87423 నెంబరులో సంప్రదించాలన్నారు.

ఉర్దూ పాఠశాలల్లో అడ్మిషన్ల స్పెషల్ డ్రైవ్



స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న దృశ్యం

సుండుపల్లె : రాష్ట్రంలో ఉర్దూ స్కూళ్లల్లో పిల్లల ఎన్‌రోల్‌మెంట్‌కు ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా సమగ్ర శిక్ష అభియాన్ ఏ.ఏ.ఎం.ఓ (ఉర్దూ) సమీవుల్లా ఖాన్, షేక్ మహ్మద్ హాషీం ప్రత్యేకంగా సుండుపల్లె మండలంలో పలు ఉన్నత పాఠశాలలు సందర్శించారు. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు ఉర్దూ స్కూళ్లలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెరగాలని సూచించారు. అనంతరం వారు పలు పాఠశాలలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీహెచ్‌ఎస్ ఉర్దూ తిమ్మసముద్రం, మడితాడు ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆరిఫుల్లా, అబిదుల్లా ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ సీఐ నాగరాజు



సిద్దవటం : ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే అట్టివారిపై కఠిన చర్యలు తప్పవని సిద్దవటం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ సీఐ నాగరాజు హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో శుక్రవారం సీఐ నాగరాజు మాట్లాడుతూ మండలంలోని డేగనవాండ్లపల్లె, టక్కోలి పెన్నానది పరివాహక ప్రాంతాల్లో చుట్టు పక్కల ఉన్న గ్రామాలకు చెందిన ట్రాక్టర్ల యజమానులు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు మాకు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలోని ఉన్నతాధికారులకు సమాచారం అందించామన్నారు. ఇసుక ట్రాక్టర్ పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. పెన్నానదిలోకి వాహనాలు వెళ్లకుండా రహదారిని జేసీబీ యంత్రంతో తొలగిస్తామన్నారు. పెన్నానదికి చుట్టుపక్కల ఉన్న రైతులు, ప్రజలు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ సిబ్బందికి సహకరించాలని ఆయన అన్నారు.

చేగువేరా స్ఫూర్తితో పోరాటాలు



చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు



చే గువేరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

బద్వేలు అర్బన్ : నేటి విద్యార్థులు, యువత చేగువేరా జీవితాన్ని, పట్టుదలను ఆదర్శంగా తీసుకుని ప్రత్యేక హోదా, కడప ఉక్కు పరిశ్రమ సాధనకు పోరాటాలకు సిద్ధం కావాలని డీవైఎఫ్‌ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, నాగార్జున పిలుపునిచ్చారు. చేగువేరా 96వ జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక డీవైఎఫ్‌ఐ పట్టణ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రపంచానికే విప్లవ చిరునామాగా ఉండి సామ్రాజ్యవాదుల, పెట్టుబడిదారుల గుండెల్లో వణుకు పుట్టించిన విప్లవ నాయకుడు చేగువేరా అని అన్నారు. సామ్రాజ్యవాదుల ఆగడాలను వ్యతిరేకిస్తూ గెరిల్లా సాయుధ పోరాట పంథాను అలవరుచుకుని లాటిన్ అమెరికా దేశాల స్థితిగతులను తెలుసుకునేందుకు సైకిల్‌పై ప్రయాణం చేసిన గొప్ప పోరాటయోధుడు అని కొనియాడారు. ఈ సందర్భంగా చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ రూరల్ అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, అర్బన్ నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి చే గువేరా

ప్రొద్దుటూరు : చే గువేరా యువతకు స్ఫూర్తి అని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రొద్దుటూరులో చే గువేరా జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ చే గువేరా క్యూబా విప్లవంలో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. ఆయన స్ఫూర్తితో యువత ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం పోరాటాలు చేయాలని తెలిపారు. నూతనంగా ఏర్పడిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్ర విభజన హామీలను అమలు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ పట్టణాధ్యక్షుడు వెంకటేష్, విశ్వనాథ్, సన్నీ, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గంగమ్మ తిరునాల

మైదుకూరు : మండలంలోని శివపురంలో శని, ఆదివారాల్లో గ్రామ దేవత గంగమ్మ తిరునాల నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ కొండా భాస్కర్ రెడ్డి, గ్రామ పెద్దలు ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో 15వ తేదీ శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని, రాత్రి రేలా రే రేలా కార్యక్రమం ఉంటుందని, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. 16వ తేదీ ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, మొక్కుబడులు తీర్చుకుంటారని తెలిపారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సేద్యపు ఎద్దులకు బండలాగుడు పోటీలు జరుగుతాయన్నారు. బండలాగుడు పోటీల్లో విజేతలకు రూ.25వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు బహుమతులు ఉంటాయని వివరించారు. అదే రోజు మనుషులు గుండు ఎత్తే పందెంతోపాటు ట్రాక్టర్ రివర్స్‌లో నడిపే పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. తిరునాల మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

విప్లవ చైతన్య జ్వాల చే గువేరా



చే గువేరా చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సంఘ నాయకులు

కడప ఎడ్యుకేషన్: విప్లవ చైతన్య జ్వాల చే గువేరా అని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజనం సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేసు యాదవ్ అన్నారు. శుక్రవారం చే గువేరా జయంతిని కడపలోని ప్రభుత్వ ఐటీఐలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. జీఆర్ఎస్ వైస్ జిల్లా అధ్యక్షులు రెడ్డిసాయి, నాయకులు శ్రీకాంత్, నాగమునెయ్య, నవీన్, తేజ, వీరభద్రాచారి, అభిలాష్, బాలాజీ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థనా మందిరం ప్రారంభం

కడప కల్చరల్ : కడప నగరం పక్కీరుపల్లెలో శుక్రవారం కడబూర ప్రార్థనా మందిరాన్ని స్థానిక ప్రముఖులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పాస్టర్ డాక్టర్ ప్రసన్నకుమార్ గోర్ల సజీవ దేవుని సరాగాలు పేరిట రచించిన స్తుతి గీతాల పుస్తకాన్ని పాస్టర్ డాక్టర్ పాల్ మోహన్ ఆవిష్కరించారు. అనంతరం ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ఇందులోని ప్రతి పాట దేవునిచేత ప్రేరేపించబడిందన్నారు. ఈ పాటలు వెలువడటానికి తన సతీమణి కృషి ఉందన్నారు. ఆయన కుమారుడు, చర్చి పరిచర్యల వ్యవస్థాపకులు పాస్టర్ ఎం.శరత్‌కుమార్ ముఖ్య ప్రసంగం చేశారు. ప్రతి క్రైస్తవుడు ఆధ్యాత్మికతతో ఇతరులకు ఆదర్శంగా నిలవాలని హితవు పలికారు. తొలుత గాయకులు పాల్ రత్నం తన పాటలతో అందరినీ అలరింపజేశారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాస్టర్లు పాల్ మోహన్, కె.రాజన్న, హరి, డేవిడ్, ఎం.వరప్రసాద్‌రావు, స్వర్ణన్ రత్నకుమార్, సంఘస్తులు, విశ్వాసులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాల్సి బాధ్యత కూటమిపై ఉంది

ఎమ్మెల్సీ గోవిందరెడ్డి



పోరుమామిళ్ల : ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాల్సిన బాధ్యత ఎన్డీఏ కూటమిపై ఉందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి కొంత సమయం ఇస్తామని, హామీలు అమలు చేయకపోతే ప్రజల పక్షాన నిలదీస్తామన్నారు. మండలిలో ప్రజల పక్షాన జగన్ సైనికుల్లా పోరాటం చేస్తామన్నారు. ప్రతిపక్షంలో ఉండటం తమకు కొత్తకాదని, గతంలో ఇబ్బందులు పెట్టినా తట్టుకుని పైకి లేచామని, ఇప్పుడు కూడా అదే తరహాలో పైకి లేస్తామన్నారు. ప్రజలు వైఎస్సార్‌సీపీకి దూరం కాలేదని, 11 స్థానాలే వచ్చినా ఓటు షేర్ 40 శాతం ఉందన్న విషయం మరువరాదన్నారు. కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం టీడీపీపై ఆధారపడిన నేపథ్యంలో అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని చంద్రబాబు రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకురావాలన్నారు. విభజన హామీలు నెరవేర్చుకునేందుకు ఇది చక్కని అవకాశమని గోవిందరెడ్డి పేర్కొన్నారు.

ఏపీని అభివృద్ధి పథంలో నడిపించడమే సీఎం ధ్యేయం


ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : ఆంధ్రప్రదేశ్‌ను ప్రగతి పథంలో నడిపించడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధ్యేయమని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే మేనిఫెస్టోలోని ఐదు అంశాలపై సంతకం చేశారని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలపై మొదటి క్యాబినెట్ మీటింగ్‌లో నిర్ణయం తీసుకుంటారన్నారు. తమ ప్రభుత్వం కక్షపూరిత చర్యలకు పాల్పడదని తెలిపారు. ఇళ్ల నిర్మాణంపై త్వరలోనే ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటుందన్నారు. పెండింగ్ బిల్లులపై అన్ని శాఖలతో సమన్వయం చేసుకొని బిల్లుల విడుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, పార్టీ పట్టణాధ్యక్షుడు ఇవీ సుధాకర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఘంటసాల వెంకటేశ్వర్లు, కామిశెట్టిబాబు, వంగనూరు మురళీధర్‌రెడ్డి, చౌడం వెంకటకొండయ్య పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు నాగభైరవ కోటేశ్వరరావు



మాట్లాడుతున్న హనుమంతరావు

బద్వేలు అర్బన్ : నేటి సమాజానికి సాహితీ స్ఫూర్తి కలిగించిన నాగభైరవ కోటేశ్వరరావు చిరస్మరణీయులు అని రాష్ట్రపతి అవార్డు గ్రహీత, ప్రముఖ సాహితీవేత్త విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు కొనియాడారు. ప్రముఖ కవి, సాహితీవేత్త నాగభైరవ కోటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా శుక్రవారం మొల్ల సాహితీపీఠం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కోటేశ్వరరావు రచనలలో సమాజ శ్రేయస్సు, అణగారిన వర్గాల పట్ల కరుణ, సానుభూతి కనిపిస్తాయన్నారు. నాగభైరవ భువన విజయమునకు పేరడిగా కవన విజయం అనే సాహిత్య రూపాకాన్ని రూపొందించి 300కు పైగా ప్రదర్శనలు ఇచ్చారన్నారు. గుండ్లకమ్మ చెప్పిన కథ, తూర్పు వాకిళ్లు, ఒయాసిస్, కన్నీటిగాథ వంటి రచనలు ఎంతో ప్రఖ్యాతి గాంచాయన్నారు. తొలుత నాగభైరవ ఆత్మశాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో భాగ్యరత్న ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి జి.వి.మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గో రక్షణ చట్టాలను కఠినంగా అమలు చేస్తాం



మాట్లాడుతున్న ఆర్డీఓ మధుసూదన్

కడప కల్చరల్ : గో రక్షణ చట్టాలను కఠినంగా అమలు చేస్తామని కడప రెవెన్యూ డివిజనల్ అధికారి మధుసూదన్ అన్నారు. గోవధ నిషేధ చట్టం అమలుపై శుక్రవారం ఆయన తన కార్యాలయంలో పీస్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. బక్రీద్ పండుగ సందర్భంగా గోవధ, వాటి మాంసం రవాణా నిషేధమన్నారు. దీన్ని అతిక్రమిస్తే తీసుకునే చర్యలు, చట్టాలు, పడే శిక్షలు గురించి వివరించారు. దీన్ని ఎవరు అధిగమించినా శిక్షలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. చట్టాన్ని ఎవరు చేతిలోకి తీసుకోకూడదని, ఎక్కడైనా జంతువులను నిర్బంధించి ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వారు వాటిని గోశాలలకు తరలిస్తారని తెలిపారు. దిశ డీఎస్పీ రమాకాంత్ మాట్లాడుతూ నగరానికి నాలుగు వైపుల చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామని, పోలీసు పెట్రోలింగ్ ఉంటుందని వివరించారు. సింగిల్ విండో పద్ధతిలో అన్ని సంస్థల అధికారులను ఒక గ్రూపుగా చేసి సమస్యలు తలెత్తిన ప్రాంతానికి పోలీసులు, పశుసంవర్ధకశాఖ, మున్సిపల్ అధికారులు వెళ్లి రక్షిస్తారన్నారు. ఈ అంశాలపై ఎలాంటి ఇబ్బంది ఉన్నా వెంటనే తమకు తెలియజేయాలని ఆర్డీఓ సూచించారు. ఈ సమావేశంలో హిందూ ధార్మిక సంస్థల పెద్దలు, బీజేపీ నాయకులు, ముస్లిం ప్రముఖులు పాల్గొన్నారు.

భద్రకాళి సన్నిధిలో రాహుకాల పూజలు



ప్రత్యేక అలంకరణలో భద్రకాళి



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు

రాయచోటి టౌన్ : పట్టణంలోని వీరభద్ర స్వామి ఆలయంలో కొలువైన భద్రకాళి అమ్మవారికి భక్తులు రాహుకాల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం ఆలయ ఈఓ డివి రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పూలు, పట్టువస్త్రాలు, ఆభరణాలు, నిమ్మకాయల హారాలతో అలంకరించారు. అనంతరం అమ్మవారికి మహిళలు నిమ్మకాయలపై వత్తులు వెలిగించి హారతులు పట్టారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ పూజలలో స్థానిక భక్తులతోపాటు కన్నడ భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి



ఎర్రగుంట్ల : మాట్లాడుతున్న సీఐ ఈశ్వరయ్య



పెండ్లిమర్రి: మాట్లాడుతున్న ఎస్‌ఐ హరిప్రసాద్

ఎర్రగుంట్ల : బక్రీద్ పండుగను ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని పట్టణ సీఐ ఈశ్వరయ్య సూచించారు. శుక్రవారం యర్రగుంట్ల పోలీస్‌స్టేషన్‌లో ముస్లిం మత పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాంతియుతంగా పండుగను జరుపుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు జరుగకుండా చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ చిరంజీవితో పాటు మత పెద్దలు పాల్గొన్నారు.

సింహాద్రిపురం: బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై అనిల్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ముస్లిం మత పెద్దలతో పీస్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా పండుగలు జరుపుకోవాలని, పండుగ సమయాల్లో ఎలాంటి రాజకీయ కక్షలకు పూనుకోవద్దని మత పెద్దలకు సూచించారు. ముస్లిం మతపెద్దలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెండ్లిమర్రి: బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరువుకోవాలని ఎస్‌ఐ హరిప్రసాద్ అన్నారు. పెండ్లిమర్రి పోలీసు స్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం బక్రీద్ పండుగ సందర్భంగా తీసుకోవల్సిన జాగ్రత్తలపై ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నింబధనలకు అనుగుణంగా పండుగను ప్రశాతంగా జరుపుకోవాలన్నారు. చట్టాన్ని అత్రికమిస్తే అటువంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

పెద్దముడియం: బక్రీద్ పండుగను ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ రామకృష్ణ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ముస్లింలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి గొడవలు లేకుండా భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు.